క్లుప్తంగా

ఎల్ఓసీ అందజేత



లబ్ధిదారుడికి ఎల్ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: మండలంలోని నాగులపల్లికి చెందిన సురేందర్ కొంత కాలంగా అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను కోరారు. స్పందించిన ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ. 2.50లక్షలు మంజూరు చేయించారు. మంజూరు పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే లబ్ధిదారుడికి అందజేశారు.

క్రమబద్ధీకరిస్తేనే సమ్మె విరమిస్తాం

పంచాయతీ జూనియర్ కార్యదర్శులు

షాబాద్: ప్రభుత్వ బెదిరింపులకు భయపడేది లేదని, సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ జీవో జారీ చేసేంత వరకు సమ్మె ఆపేది లేదని పంచాయతీ జూనియర్ కార్యదర్శులు స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు జేపీఎస్‌లు సమ్మె విరమించి విధుల్లో చేరాలని, లేని పక్షంలో ఉద్యోగాల నుంచి తొలగిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే మండలంలోని జేపీఎస్‌లో ఎవరూ వీధుల్లో చేరలేదు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ బెదిరింపులకు తాము భయపడేది లేదని, సమ్మెను యథాతథంగా కొనసాగిస్తామని ప్రకటించారు.

మైసిగండిలో వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ క్రీడాకారులతో నాయకులు

కడ్తాల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తామని మైసిగండి సర్పంచ్ తులసీరాంనాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో వాలీబాల్ ప్రీమీయర్ లీగ్ పోటీలను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు రాందాస్‌నాయక్, రెడ్యానాయక్, హీరాసింగ్, క్రీడాకారులు ఉన్నారు.

సీఎం కప్ -2023పై అవగాహన



సమావేశమైన ప్రజాప్రతినిధులు, అధికారులు

కందుకూరు: మండల స్థాయిలో యువతీయువకులకు నిర్వహించనున్న సీఎం కప్-2023 క్రీడా పోటీలకు సంబంధించి మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకట్రాములు, సీఐ కృష్ణంరాజు, ఏంఈఓ కృష్ణయ్య, ఎంపీఓ విజయలక్ష్మి అవగాహన కల్పించారు. యువతీయువకులకు పరుగు పందెం 100 మీటర్లు, 400 మీటర్లు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు.. కేవలం యువకులకు ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 11వ తేదీ(గురువారం) వరకు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శుల వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్‌తోనే తండాల అభివృద్ధి



రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

మహేశ్వరం: నాగారం-పడమటి తండా బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలే తెలియజేస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజునాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగారం-పడమటి తండాల్లో స్థానిక నాయ కులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన రోడ్డును పరిశీలించారు. గిరిజన తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. మండలంలోని ప్రతి గిరిజన తండాకు మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారన్నారు. నాగారం మాజీ సర్పంచ్ రాములునాయక్, నాగారం ఉపసర్పంచ్ లతీఫ్ ఖాన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగం ముదిరాజ్, లింగ్యానాయక్, దేవులనాయక్, శివగౌడ్ పలువురు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

షాద్‌నగర్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. పట్టణంలోని ఓ కళాశాలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని షేక్ సయ్యదా పర్వీన్‌కు 470 మార్కులకు గాను 466 మార్కులు, మరో కళాశాలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో దుర్గా భవానీ 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థినులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

కమ్మదనం గురుకులంలో..

షాద్‌నగర్ రూరల్: ఇంటర్ ఫలితాల్లో కమ్మదనం గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత అభినందించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 93.68 శాతం, ద్వితీయ సంవత్సరంలో 93.33 శాతం ఉత్తీర్ణులయ్యారు.

మొగిలిగిద్ద కేజీబీవీలో..

ఫరూఖ్‌నగర్ మండలంలోని కేజీబీవీ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 55 మందికి గాను 38 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 64 మందికి గాను 57 మంది ఉత్తీర్ణత సాధించారు.

చేవెళ్ల విద్యార్థుల హవా

చేవెళ్ల: ఇంటర్మీడియేట్ ఫలితాల్లో చేవెళ్ల మండలంలోని ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. ఆదర్శ కళాశాలకు చెందిన హర్షిత ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపీసీలో 987 మార్కులు సాధించి స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించింది. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ టీనావతి అభినందించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...

ఇంటర్ ఫలితాల్లో చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరంలో 190 మందికి గాను 115 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో మధుసూదన్ 954 మార్కులు, బైపీసీలో సానియా 929, సీఈసీలో అంజు 729, హెచ్ఈసీలో మానస 898, సెరికల్చర్‌లో యశ్వంత్ 963, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్‌లో సౌందర్య 938, కంప్యూటర్ సైన్స్‌లో సరయాబేగం 976, ఈడబ్ల్యూసీలో అరుణ్‌కుమార్ 917 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. మొదటి సంవత్సరంలో 203 మందికి 95 మంది ఉత్తీర్ణత సాధించారు.

69 శాతం ఉత్తీర్ణత

షాబాద్: ఇంటర్ పరీక్షల్లో షాబాద్ మండల విద్యార్థులు 69 శాతం ఉత్తీర్ణత సాధించిన్నట్లు తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాచ్చ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కళాశాలలో 172 మంది పరీక్షలు రాయగా 118 మంది ఉత్తీర్ణత సాధించారు.

99శాతం ఉత్తీర్ణత

మొయినాబాద్: ఇంటర్ ఫలితాల్లో చిలుకూరు గురుకులం 99 శాతం ఉత్తీర్ణత సాధించింది. చిలుకూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 59 మంది విద్యార్థులకు గాను 58 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో 68 మంది విద్యార్థులకు గాను 64 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో రాముడు 980 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. బైపీసీలో పి.శివ 975 మార్కులు సాధించాడు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో కె.నవీన్ 465, బైపీసీలో ఎం.దీన్‌దయాల్ 429 మార్కులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

మొయినాబాద్‌రూరల్: ఇంటర్ ఫలితాల్లో చేవెళ్ల గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. మంగళవారం ఆమె ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరాలు వెల్లడించారు. బైపీసీలో 37 మందికి గాను 34 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు, ఎంపీసీలో 24 మందికి గాను 22 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బైపీసీలో కే శిరీషా(433/440), ఎంపీసీలో ప్రియాంక (460/470), అశ్విని(462/470) మార్కులు సాధించారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను చేవెళ్ల గురుకుల ఆర్‌సీవో శారద, ప్రిన్సిపాల్ రమాదేవి అభినందించారు.

కొందుర్గు కేజీబీవీలో..

కొందుర్గు: పట్టణంలోని కేజీబీవీ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ మొదటి సంవత్సరంలో వింధ్యా 493మార్కులు, ద్వితీయ సంవత్సరంలో అనిత 975 మార్కులు, మొదటి సంవత్సరం సీఈసీలో రాధిక 386 మార్కులు, రెండో సంవత్సరంలో స్వప్న 952 మార్కులు సాధించారు.

కేశంపేట మండలంలో..

కేశంపేట: మండలంలోని పాటిగడ్డ కేజీబీవీ, కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభను కనబరిచారు. పాటిగడ్డ కేజీబీవీలో మొదటి సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ఎస్ఓ గౌసియా బేగం తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 97శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ మొదటి సంవత్సరంలో 93 శాతం, ద్వితీయ సంవత్సరంలో 97శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరంలో 52శాతం, ద్వితీయ సంవత్సరంలో 92శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు.



విద్యార్థిని దుర్గా భవానీని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం



హర్షిత, బైపీసీ(987) | శిరీష, బైపీసీ(984) | నివేదిత, ఎంపీసీ(982) | రాముడు, ఎంపీసీ(980) | అనిత, ఎంపీహెచ్‌డబ్ల్యూ(975)

స్వప్న, సీఈసీ(952) | శ్రుతి, బైపీసీ(949) | నందిని, ఎంపీసీ(947) | శిరీష, బైపీసీ(433) | పూజ, ఎంపీసీ(440)

సయ్యదా పర్వీన్, ఎంపీసీ (466) | శ్రావణి, ఎంపీసీ(465) | అశ్విని, ఎంపీసీ(462) | ప్రియాంక, ఎంపీసీ (460) | శిరీష, బైపీసీ(433)

సీఐపై చర్యలు తీసుకోండి: వీర్లపల్లి శంకర్

నందిగామ: తనపై అక్రమ కేసులు నమోదు చేసిన నందిగామ సీఐ రామయ్యపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ మంగళవారం డీసీపీ నారాయణరెడ్డిని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నందిగామ మండలం చేగూరు శివారులోని సర్వే నంబరు 78లో 3 ఎకరాల 19 గుంటల భూమి తన పేరుతో పాటు మరొకరి పేరున పట్టా ఉందని తెలిపాడు. ఇట్టి భూమిని గతేడాది ఫిబ్రవరిలో శ్రీనివాస్‌కు విక్రయించి అగ్రిమెంట్ చేశామని వివరించారు. రిజిస్ట్రేషన్‌కు మూడు నెలల గడువు ఇచ్చామని, గడువులోగా డబ్బులు సర్దుబాటు కాక పోవడంతో మరో రెండు నెలలు గడువు ఇచ్చామని, డబ్బులు లేక శ్రీనివాస్ తన అగ్రిమెంట్‌ను రద్దు చేసుకున్నాడని తెలిపాడు. అయితే ఇటీవల శ్రీనివాస్‌తో సీఐ రామయ్య బలవంతంగా తనపై ఫిర్యాదు చేయించి తప్పుడు కేసు నమోదు చేశాడని వివరించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి సీఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి పరిహారం



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాయకులు

కొత్తూరు: మున్సిపల్ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో మృతి చెందిన కార్మికుడికి సంబంధిత పరిశ్రమ యాజమాన్యం రూ. 12 లక్షల పరిహారం ప్రకటించింది. పరిహారం కోసం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ప రిశ్రమ నిర్వాహకులతో చర్చలు జరిపారు. మంగళవారం మృతుడి కుటుంబానికి రూ. 12లక్షల పరిహారం, అంత్యక్రియలకు రూ. 50వేలు ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో బాధిత కుటుంబం.. నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

యుద్ధ విద్య ఎంతో ముఖ్యం

స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

షాద్‌నగర్: విద్యార్థినులకు చదువు తోపాటు యుద్ధ విద్య కూడా ఎంతో ముఖ్యమని స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ చెన్నయ్య అన్నారు. షాద్‌నగర్ శివారులోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నాగర్‌కర్నూల్ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు మంగళవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ.. యుద్ధ విద్యలు అనేవి ఆపదకాలంలో ప్రత్యర్థుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. బయటికి వెళ్లే అమ్మాయిలు, యువతులు ఇంటికి వచ్చే వరకు తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతుంటారని అన్నారు. దీన్ని అధిగమించాలంటే ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవాలన్నారు. తద్వార యువతుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చెన్నయ్యను సన్మానిస్తున్న విద్యార్థినులు

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి

ఎస్ఎఫ్ఐడబ్ల్యూ మహిళా సంఘం

చేవెళ్ల: దేశానికి పతకాలు సాధించి గౌరవం తెస్తున్న మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడడం సరైంది కాదని ఎస్ఎఫ్ఐ డబ్ల్యూ మహిళా సంఘం నాయకురాలు మంజుల, అమృత, మాధవి, వినోద అన్నారు. మహిళా రెజ్లర్లపై జరిగిన లైంగిక వేధింపులకు నిరసనగా మంగళవారం చేవెళ్లలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ చోటు చేసుకోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకురాలు మాధవి, సాయిలమ్మ, అమృత, నిర్మల, రేఖ, వినోద, సుగుణ, జయమ్మ, అరుణ, అండాలు, లత, సరిత, హైమావతి, మంజుల, సంపూర్ణ, వెంకటమ్మ, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళా సంఘం సభ్యులు

నిధుల మంజూరుపై రజకుల హర్షం

ఆమనగల్లు: పట్టణంలో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చిత్రపటాలకు రజక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఆమనగల్లు పట్టణంలో రజకుల సౌకర్యార్థం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధోబీఘాట్ల నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయించారు. దీంతో స్థానిక పట్టణంలోని జాతీయ రహదారిపై రజకసంఘం ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రజక సంఘం నాయకులు ఆనంద్, తిరుపతయ్య, జగన్, యాదయ్య, లింగం, నర్సింహ, యాదయ్య, అయోధ్య, అంజయ్య, వెంకటయ్య, కుమార్, శ్రీశైలం, జగన్, నర్సింహా, శేఖర్, అల్లాజీ, అరుణ్ పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడిపితే చర్యలు



మొయినాబాద్ రూరల్: వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ బోస్ కిరణ్



షాబాద్: సర్దార్‌నగర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

షాబాద్: మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ట్రాఫిక్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని సర్దార్‌నగర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మొయినాబాద్ రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉండదని రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ బోస్‌కిరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ ఎస్సై ఎక్బాల్ ఆధ్వర్యంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బోస్ కిరణ్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై నారాయణసింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’తో దృష్టి సమస్యలు దూరం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న దృష్టి సమస్యలు దూరం అవుతున్నాయని, ఇది సీఎం కేసీఆర్ ముందు చూపు వల్లే సాధ్యమైందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని దేవునిఎర్రవల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. కంటి సమస్య తీవ్రంగా ఉంటే ఆపరేషన్లు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్ మాణిక్యరెడ్డి, ఎంపీపీ ఎం విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎం మాణిక్యరెడ్డి, నాగార్జున్‌రెడ్డి, ఎం చింటూ, రాములు, మాణిక్యం, శ్రీశైలం పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మల్లారెడ్డిగూడ సర్పంచ్ సీ జంగయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మల్లారెడ్డిగూడలో కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలతో పేదల ఇబ్బంది పడరాదనే ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గోపాల్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



దేవునిఎర్రవల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

ఆలయాన్ని ధ్వంసం చేయడం దారుణం

- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- బీజేపీ నేతల డిమాండ్



ధ్వంసమైన ఆలయాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేత విజయ్‌కుమార్ తదితరులు

షాద్‌నగర్ రూరల్: మున్సిపల్ పరిధిలోని చౌడమ్మ గుట్టపై వెలసిన ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నేతలు ఆలయాన్ని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ... వందల సంవత్సరాల చరిత్ర గల ఆలయాన్ని రియల్టర్లు తమ స్వప్రయోజనాల కోసం ధ్వంసం చేశారని ఆరోపించారు. బంజార ఆరాధ్య దైవంగా భావించే ఆలయాన్ని కూల్చి వారి మనోభావాలను దెబ్బతీయడం దారుమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, బీ రమేష్, సీ వెంకటేష్, మురళీ, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి: వైఎస్సార్ టీపీ

పహాడీషరీఫ్: నిరుద్యోగుల జీవితాలను దృష్టిలో ఉంచుకొని టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని వైఎస్సార్ టీపీ యువజన విభాగం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జీ సుమన్ గౌడ్ కోరారు. పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పిలుపు మేరకు మంగళవారం ఆయన టీ-సేవ్ ఉద్యమంలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు లేఖ రాశారు. ఆ లేఖను రిజిస్టర్ పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమైన నిరుద్యోగుల జీవితాలతో టీఎస్‌పీఎస్సీ అధికారులు చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. పేపర్ లీకేజీ ఘటన పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు.



రాష్ట్రపతికి పంపనున్న లేఖను చూపుతున్న సుమన్‌గౌడ్, తదితరులు

15నుంచి క్రీడా పోటీలు



కొత్తూరు: సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీలత

కొత్తూరు: మండలంలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న చీఫ్ మినిస్టర్స్ కప్ -2023కు సంబంధించి మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎంపీడీవో శరత్‌చంద్రబాబు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శ్రీలత, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య మాట్లాడుతూ.. 15 నుంచి 36ఏళ్ల వారు పోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. క్రీడల్లో పాల్గొనే వారి (జట్ల) వివరాలు ఈ నెల 12వ తేదీ లోపు ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు యువతకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తోపాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శోభా, తహసీల్దార్ రాములు, సర్పంచులు, ఆయా శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

సీఎం కప్‌ను విజయవంతం చేయండి

కొందుర్గు: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం చీఫ్ మినిస్టర్స్ కప్ పేరిట ఆట పోటీలు నిర్వహిస్తోందని, వీటని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. మంగళవారం కొందుర్గు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.